
TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 35 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | మే 14, 2026

# కాన్వాయ్‌ల కోతతోనే పొదుపు సాధ్యమా?




- ఆర్థిక సంక్షోభం వేళ పాలకులు విలాసాలు వీడాలి
- నిత్యావసరాల ధరల మంట..
- విప్లవాత్మక చర్యల దిశగా సాగాలి
- ప్రజాప్రతినిధుల విలాసాలకు అడ్డుకట్ట ఎప్పుడు?

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా అడుగులు వేస్తోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయి విలువ పతనం, స్టాక్ మార్కెట్ల కుప్పకూలడం వంటి పరిణామాలు భారత ఆర్థిక వ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'పొదుపు' సూచనలు చర్చనీయాంశంగా మారాయి. అయితే, కేవలం కాన్వాయ్‌లలో కార్ల సంఖ్యను తగ్గించడం వల్ల మాత్రమే ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందా? అంటే కాదనే సమాధానం వినిపిస్తోంది.

## • నిత్యావసరాల ధరల మంట..

ఏప్రిల్ నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి చేరి సామాన్యుడి నడ్డి విరుస్తోంది. పప్పులు, కూరగాయలు, వంటనూనెల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దీనికి తోడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని కేంద్ర మంత్రులు, ఆర్‌బీఐ గవర్నర్ చేస్తున్న వ్యాఖ్యలు సామాన్యుడిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చమురు ధరలు పెరిగితే రవాణా భారమై అన్ని వస్తువుల ధరలు అమాంతం పెరుగుతాయి.

## • ప్రజాప్రతినిధుల విలాసాలకు అడ్డుకట్ట ఎప్పుడు?

ప్రజలను పొదుపు చేయమని, బంగారం కొనొద్దని, విదేశీ ప్రయాణాలు తగ్గించుకోవాలని సూక్తులు చెబుతున్న పాలకులు.. తమ విలాసాల విషయంలో మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఒకవైపు సామాన్య ఉద్యోగులకు పెన్షన్ల కోసం పోరాటాలు చేయాల్సి వస్తుంటే, ప్రజాప్రతినిధులు మాత్రం రెండేసి పెన్షన్లు అనుభవిస్తున్నారు. వీటిని ఎందుకు రద్దు చేయకూడదు?. శాసనమండళ్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ వంటి కొన్ని వ్యవస్థల వల్ల ఆశించిన ప్రయోజనం లేకపోయినా, వాటి కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు.లక్షల్లో జీతాలు తీసుకునే ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఉచిత బంగళాలు, విద్యుత్, ఫోన్ బిల్లుల వంటి రాయితీలు ఎందుకు?

## • విప్లవాత్మక చర్యలు అవసరం

ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం కేవలం నామమాత్రపు పొదుపు చర్యలతో సరిపెట్టుకోకూడదు. ప్రజాప్రతినిధుల జీతభత్యాలు, విలాసవంతమైన విదేశీ పర్యటనలపై నియంత్రణ ఉండాలి. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో రాజకీయ నేతల ప్రయాణాల ఖర్చును తగ్గించాలి. ఉపాధి హామీ నిధుల కోతను నిలిపివేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తున్న వేళ, త్యాగాలు కేవలం సామాన్య ప్రజలకే పరిమితం కాకూడదు. పాలకులు కూడా తమ విలాసాలను వీడి ఆదర్శంగా నిలిచినప్పుడే దేశం ఈ సంక్షోభం నుండి గట్టెక్కుతుంది. కాన్వాయ్ కార్లను తగ్గించడం కంటే, పాలనా వ్యయాన్ని తగ్గించడంపై ప్రధాని దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# భద్రాద్రి రాముని చెంత మంత్రి తుమ్మల



2లో..

- 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి
- ఆలయ పునరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- తుమ్మల నాగేశ్వరరావు




- సుబోధ్ గ్యాంగ్ పనే!
- ముగ్గురు నిందితుల అరెస్ట్..
- రూ. 82 లక్షల విలువైన బంగారం స్వాధీనం

2లో..

# పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసు ఛేదించిన పోలీసులు

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, మే 14, 2026

# పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసు ఛేదించిన పోలీసులు

- సుబోధ్ గ్యాంగ్ పనే!
- ముగ్గురు నిందితుల అరెస్ట్..
- రూ. 82 లక్షల విలువైన బంగారం స్వాధీనం

**కరీంనగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కరీంనగర్ పట్టణంలో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. సినీ ఫక్కీలో కాల్పులు జరిపి బంగారం ఎత్తుకెళ్లింది బీహార్‌కు చెందిన ప్రమాదకరమైన 'సుబోధ్ సింగ్ గ్యాంగ్' అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం వెల్లడించారు. గురువారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. రెండు నెలల క్రితం తెలంగాణకు వచ్చిన ఈ ముఠా ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్‌లలోని ప్రముఖ బంగారు షాపులపై రెక్కీ నిర్వహించింది. పీఎంజే షాపును లక్ష్యంగా చేసుకున్న ఐదుగురు దుండగులు పిస్టల్స్‌తో లోపలికి ప్రవేశించి కేవలం ఐదు నిమిషాల్లోనే పని ముగించుకున్నారు. అడ్డువచ్చిన సేల్స్ మేనేజర్ ముస్తాక్ అలీతో పాటు సిబ్బంది కమల్, మధుకర్, సెక్యూరిటీ గార్డు రాజేశ్‌పై కాల్పులు జరిపి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం 161.4 తులాల (సుమారు కిలోన్నర) బంగారు ఆభరణాలతో బైక్‌లపై పరారయ్యారు.

- **అరెస్టయిన నిందితులు వీరే:**

ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీరా సింగ్‌తో పాటు ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. వీరి నుంచి రూ. 82 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నకిలీ ఆధార్ కార్డులు, బైక్ నెంబర్ ప్లేట్లు, సిమ్ కార్డులతో తిరుగుతూ పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఈ గ్యాంగ్‌పై బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అనేక కేసులు ఉన్నాయి. వీరిని 'గోల్డెన్ తీఫ్స్'గా పిలుస్తారు. 12 రోజుల పాటు అత్యంత చాకచక్యంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. దోపిడీ తర్వాత వీరు రైళ్లు, బస్సుల ద్వారా తప్పించుకునేందుకు ప్రయత్నించారు. జిల్లా జడ్జి నివాసం, ఎంపీ బండి సంజయ్ కార్యాలయానికి సమీపంలోనే ఈ భారీ దోపిడీ జరగడంతో అప్పట్లో తీవ్ర కలకలం రేగింది. కేసును సత్వరమే ఛేదించిన పోలీసు బృందాన్ని సీపీ గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

# పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఘనంగా 'పేరెంట్ - టీచర్ మీటింగ్'
- విద్యా వారోత్సవాల్లో భాగంగా తల్లిదండ్రులతో ముఖాముఖి
- గ్రామాల్లో 'దోస్త్' అడ్మిషన్లపై విస్తృత ప్రచారం



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగవ రోజైన గురువారం కళాశాల ప్రిన్సిపల్ కె. గోపాల్ అధ్యక్షతన 'పేరెంట్ – టీచర్ మీటింగ్' (తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశం) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె. గోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కళాశాలలో అధ్యాపకులు అందించే బోధనతో పాటు, ఇంటి వద్ద కూడా పిల్లలు చదువుకోవడానికి అనువైన ప్రశాంత వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలని కోరారు. కళాశాలలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వసతులు, ల్యాబ్స్, గ్రంథాలయ సౌకర్యాల గురించి వారికి వివరించారు. అనంతరం తల్లిదండ్రులంతా కళాశాల ప్రాంగణాన్ని చుట్టివచ్చి, సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే లక్ష్యంతో అధ్యాపక బృందం అమ్రాబాద్ మండల కేంద్రంలో విస్తృత ప్రచారం నిర్వహించింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులను కలిసి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉచిత విద్, ఇతర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.రాధ, ఎ.చంద్రయ్య, అధ్యాపకేతర సిబ్బంది ఎం.రామకృష్ణ, సి.రాఘవేందర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రాముని చెంత మంత్రి తుమ్మల

- 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి
- ఆలయ పునరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాచలం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రికి ఆలయ పండితులు వేదాశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు తన 40 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. 1986 మే 14న స్వర్గీయ ఎన్టీఆర్ మంత్రివర్గంలో తొలిసారిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన, నేటితో (మే 14, 2026) నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రయాణాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు. దర్శనానంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. "భద్రాచలం ప్రాంతం నుంచే నా రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఈ 40 ఏళ్లలో రాముని ఆశీస్సులు నాకు ఎప్పుడూ ఉన్నాయి. గతంలో ఎన్టీఆర్ హయాంలో భద్రాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసే భాగ్యం దక్కింది" అని గుర్తు చేసుకున్నారు. భద్రాచలం రామాలయ పునరాభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే రూ. 351 కోట్లతో భూమి పూజ చేశారని ఆయన తెలిపారు. భద్రాద్రిని అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని వెల్లడించారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన ప్రజలకు, తనపై నమ్మకం ఉంచిన నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు.

# బండి భగీరథుని వెంటనే అరెస్టు చేయాలి

- సీపీఎం నాయకుల డిమాండ్




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన బండి భగీరథునిపై పోక్సో కేసు నమోదైనప్పటికీ, అతడిని అరెస్టు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం వహించడం తగదని సీపీఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం అచ్చంపేట మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధం సైదులు మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు కావడమే అరెస్టు కాకపోవడానికి కారణమని ఆరోపించారు. స్వయంగా బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా, నిందితుడిని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఒక సామాన్యుడి కేసును అధికార బలంతో నీరుగార్చడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. నిందితుడు ఎంతటి బలవంతుడైనా సరే, వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. తప్పు చేసిన వారిని చట్టం నుంచి తప్పించే ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బి.రాములు, శివకుమార్, ఎస్.వెంకటయ్య, పర్వతాలు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, అడ్డకూలి సంఘం కార్యదర్శి వెంకటయ్య, నాయకులు రాజు, మల్లేష్, గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో మరో 'నిర్భయ' తరహా ఘాతుకం

- వివాహితపై బస్సు డ్రైవర్, కండక్టర్ అఘాయిత్యం



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశ రాజధాని ఢిల్లీలో మహిళల రక్షణ ప్రశ్నార్థకమవుతోంది. నడిరోడ్డుపై బస్సు ఆపి ఒక వివాహితను బలవంతంగా లోపలికి లాక్కెళ్లి, డ్రైవర్, కండక్టర్ అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణం సోమవారం రాత్రి రాణీబాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలు (34) ముగ్గురు పిల్లల తల్లి. ఆమె మంగోల్‌పురిలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తూ పీతమ్‌పురాలో నివసిస్తోంది. సోమవారం రాత్రి విధులు ముగించుకుని ఆమె ఇంటికి తిరిగి వస్తుండగా, సరస్వతీ విహార్ వద్ద ఒక స్లీపర్ బస్సు వచ్చి ఆగింది. బస్సు ద్వారం వద్ద నిలబడి ఉన్న నిందితుడు మొదట ఆమెను సమయం ఎంత అని అడిగి, ఆపై ఆమె తేరుకునేలోపే బలవంతంగా బస్సులోకి లాక్కెళ్లాడు. బాధితురాలిని బస్సులోకి ఎక్కించుకున్న అనంతరం నిందితులు బస్సును నాంగ్లోయి వైపు ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ డ్రైవర్, కండక్టర్ కలిసి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. నిందితుల చెర నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన పోలీసులు, ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వైద్య నివేదికల అనంతరం అత్యాచారం జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టిన పోలీసులు, నిందితులైన డ్రైవర్, కండక్టరును అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ఢిల్లీలో మరోసారి బస్సులో ఇటువంటి ఘాతుకం జరగడంపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, మే 14, 2026

# బక్రీద్ వేళ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు
- సమాచారం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హిందూ సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో మూడు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి స్టేషన్ పరిధిలో 24/7 వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. 1977 నాటి గోవధ నిరోధక చట్టం, 1960 నాటి జంతు హింస నిరోధక చట్టం, 1978 నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. అనుమానాలతో రోడ్ల దిగ్బంధనాలు, ఘర్షణలు సృష్టించవద్దు. నిబంధనలు మీరితే క్రిమినల్ కేసులతో పాటు రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు తెరుస్తాం. గత ఏడాది ఇలాంటివి చేసిన వారిపై రెండు కేసులు నమోదు చేశాం. పశువుల అక్రమ రవాణా సమాచారాన్ని జిల్లా పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8712537826 లేదా నోడల్ అధికారి (స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ) నంబర్ 8712656410 కు అందించాలి. తనిఖీల్లో సీజ్ చేసిన పశువుల సంరక్షణ కోసం జిల్లాలో 9 ఆశ్రయ కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఎస్పీ తెలిపారు. అక్కడ వెటర్నరీ డాక్టర్లతో పాటు మేత, నీటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐ రవి, ఎస్ఐ శ్రీకాంత్, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డ ఆర్ఐ



**దుగ్గొండి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. వారసత్వ భూమి బదిలీ ఫైలును ముందుకు జరిపేందుకు రూ.10 వేల లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)ను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధిర గ్రామానికి చెందిన లొల్లాటి రాజు అనే రైతు, తన తండ్రి నర్సయ్య మరణించడంతో ఆయన పేరిట ఉన్న 27 గుంటల వ్యవసాయ భూమిని తన పేరుపై మార్చుకునేందుకు (వారసత్వ నమోదు) దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఈ పని చేయడానికి ఆర్ఐ రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రాజు నుంచి ఆర్ఐ లంచం తీసుకుంటుండగా పక్కా ప్రణాళికతో దాడి చేసి పట్టుకున్నారు. ఆర్ఐ నుంచి నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, కార్యాలయంలోని పలు రికార్డులను సీజ్ చేశారు. ఈ ఘటనతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్కతుర్తిలో కత్తులతో దాడి

**యువకుడికి తీవ్ర గాయాలు**



**ఎల్కతుర్తి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో గురువారం ఘోరం జరిగింది. మండల కేంద్రంలోని తాళ్ల మండవా ప్రాంతంలో గొడిశాల విజయ్ కళ్యాణ్ అనే యువకుడిపై అక్కినపల్లి అఖిల్ అనే వ్యక్తి కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో విజయ్ కళ్యాణ్ తీవ్ర రక్తస్రావానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించారు. తీవ్ర గాయాలైన విజయ్ కళ్యాణ్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్కతుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పట్టపగలే కత్తులతో దాడి జరగడంతో మండల కేంద్రంలో ఒక్కసారిగా కలకలం రేగింది.

# ‘బీజేపీవి మభ్యపెట్టే రాజకీయాలు’

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బండి సంజయ్‌పై నాయిని ఫైర్
- తప్పు చేసి ‘జై శ్రీరామ్’ అంటే సరిపోదు!

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పవిత్రమైన దేవుళ్ల పేర్లు, మత భావోద్వేగాలను ఉపయోగించడం అత్యంత దురదృష్టకరమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. గురువారం బాలసముద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, సామాన్యులకు ఒక న్యాయం, కేంద్ర మంత్రుల కుటుంబాలకు మరో న్యాయం అన్న పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం సహించదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బండి భగీరథ్ తప్పు చేయకపోతే విచారణకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించారు. ఈ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి వెనుకబడిన వర్గాల (బీసీ) పేరును తెరపైకి తీసుకురావడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. “తప్పు చేసి ‘జై శ్రీరామ్’ అంటే మాఫీ లభించే పరిస్థితిని బీజేపీ తీసుకొచ్చింది. తాము ప్రతిరోజూ రామనామ స్మరణతోనే రోజును ప్రారంభిస్తాం, కానీ రాజకీయ స్వలాభాల కోసం ఏనాడూ దేవుడి పేరును వాడుకోలేదు” అని నాయిని వ్యాఖ్యానించారు. ఆలయాల అభివృద్ధి: గత పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి తెలంగాణలో ఒక్క ఆలయాన్ని కూడా సమగ్రంగా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బీజేపీకి దేవుళ్లపై చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ఆలయాలకు కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలు వెల్లడించాలని సవాల్ విచారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భద్రాచలం, బాసర, వేములవాడ పుణ్యక్షేత్రాలతో పాటు సమ్మక్క–సారలమ్మ



జాతరకు భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే బీజేపీ నాయకులు అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని, మత విద్వేష రాజకీయాలు మానుకుని అభివృద్ధితో ప్రజల ముందుకు రావాలని ఎమ్మెల్యే నాయిని హితవు పలికారు.

# ఉపాధి కూలీల సమ్మెను జయప్రదం చేయండి

- వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు
- పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- రెండు ఫోటోల విధానాన్ని రద్దు చేయాలి



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం మే 15న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సదగోడు గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు సంబంధించిన పెండింగ్ వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి. ఎన్ఎంఎస్ యాప్‌లో ప్రవేశపెట్టిన రెండు ఫోటోల విధానాన్ని రద్దు చేయాలి. అర్హులైన కొత్త లబ్ధిదారులందరికీ ఉపాధి జాబ్ కార్డులు, కూలీలకు పే స్లిప్పులు అందజేయాలి. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ పునరుద్ధరించాలి. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు (రెండవ విడత), అలాగే నూతన పింఛన్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ నాయకులు భీంపాకుల అంజయ్య, వెంకటయ్య, లక్ష్మమ్మ, దామోదర్, అనిత, మాధవి, పద్మమ్మ, సుజాతమ్మ, నిరంజన్, జంగయ్య పాల్గొన్నారు.

## చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం

**నల్లగొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు పెను సాంకేతిక అంతరాయం ఏర్పడింది. రైలు ఇంజిన్‌లో విద్యుత్ సమస్య తలెత్తడంతో రైలు పట్టాలపైనే నిలిచిపోయింది. సుమారు రెండున్నర గంటల పాటు రైలు కదలకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో, ఇంజిన్ ఆగిపోవడంతో రైలులోని ఏసీలు, ఫ్యాన్లు పనిచేయలేదు. దీంతో బోగీల్లోని ప్రయాణికులు, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోయారు. రైలు ఎప్పుడు కదులుతుందో తెలియని పరిస్థితుల్లో ప్రయాణికులు రైల్వే అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న రైల్వే సాంకేతిక సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకుని ఇంజిన్ మరమ్మతులు చేపట్టారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో ఉదయం 9:50 గంటల ప్రాంతంలో రైలు తిరిగి తన గమ్యస్థానానికి బయలుదేరి వెళ్లింది. రైలు కదలడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు



**కోనరావుపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ సూచించారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, స్థానిక రైస్ మిల్లును గురువారం ఆయన సందర్శించారు. విధుల్లో ఉన్న అధికారులను అడిగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వివరాలను తెలుసుకున్నారు. ధాన్యంలోడింగ్ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైస్ మిల్ యాజమాన్యానికి ఈ సందర్భంగా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, దళారులు ఇబ్బంది పెట్టినా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ పర్యటనలో ఎస్పీ వెంట సీఐ రవీందర్, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, మే 14, 2026

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని మొల్గర గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ సులోచమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం నిర్దేశిత తేమ శాతం ఉండేలా చూసుకుని రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, తద్వారా మద్దతు ధర పొంది లబ్ధి పొందాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాదుగుల రమేష్, వార్డు సభ్యులు పర్వతాలు, జ్యోతి, స్థానిక నాయకులు సుమన్ రెడ్డి, శంకర్, శేఖర్, ఎల్లస్వామి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కోహ్లీ 'విరాట్' రూపం

- కోల్‌కతాపై ఆర్‌సీబీ ఘనవిజయం
- వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానం

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్ సీబీ) తన విజయపరంపరను కొనసాగిస్తోంది. కోల్‌కతాతో జరిగిన ఉత్కంఠ భరిత పోరులో విరాట్ కోహ్లీ అజేయ శతకంతో చెలరేగడంతో ఆర్‌సిబి సూపర్ విక్టరీని నమోదు చేసింది. ఈ విజయంతో బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ క్లాసిక్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. కేవలం ఫోర్లు, సిక్సర్లకే పరిమితం కాకుండా మైదానం నలుమూలలా బంతిని పంపుతూ 105 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కోహ్లీ కెరీర్‌లో ఇది 9వ ఐపీఎల్ సెంచరీ కావడం విశేషం. అద్భుత ప్రదర్శన చేసిన కోహ్లీకే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "నాకు వ్యక్తిగత రికార్డుల కంటే మ్యాచ్‌ను ఫినిష్ చేయడమే ముఖ్యం. గత రెండు మ్యాచ్‌ల్లో పరుగులు చేయలేకపోయాను, ఆ వెలితి నన్ను లోలోపల వేధించింది. అయితే, ఒత్తిడి ఉన్నప్పుడే నాలోని మెరుగైన ఆట బయటకు వస్తుంది" అని పేర్కొన్నాడు. నెట్స్‌లో కఠినంగా సాధన చేయడం వల్లనే ఈ స్థాయి ప్రదర్శన సాధ్యమైందని విరాట్ తెలిపాడు. ఎప్పుడు బౌండరీలు కొట్టాలి, ఎప్పుడు సింగిల్స్ తీయాలి అనే విషయంలో స్పష్టతతో ఉన్నట్లు చెప్పాడు. "రికార్డులు బ్రేక్ చేయడం కాదు, నాకు క్రికెట్ ఆడటం ఇష్టం. మైదానంలోకి




దిగితే నా మనసంతా ఆటపైనే ఉంటుంది. దేవుడి దయ వల్ల మంచి ఇన్నింగ్స్ ఆడాను" అని విరాట్ వెల్లడించాడు. ఆర్‌సీబీ ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే ఈ ఏడాది కూడా టైటిల్ రేసులో అందరికంటే ముందున్నట్లు కనిపిస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**దుగ్గొండి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి గ్రామంలో గురువారం 'బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.. గ్రామంలో నిర్వహించిన బడిబాట ర్యాలీ, ఇంటింటి ప్రచారంలో స్వయంగా పాల్గొన్నారు. తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. అర్హత కలిగిన ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థులకు సమతుల పౌష్టికాహారం, అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. "మల్లంపల్లి హెచ్ పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కావ్యశ్రీ టెన్త్ ఫలితాల్లో 566 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ, జిల్లా జడ్పీ పాఠశాలల విభాగంలో మొదటి స్థానం సాధించడం అభినందనీయం. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడులకు పంపాలి" అని కలెక్టర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ పిలుపునకు స్పందించిన పలువురు తల్లిదండ్రులు తమ



పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి, డీఈఓ రంగయ్య నాయుడు, తహసీల్దార్ సమ్మక్క, సీఎంఓ డాక్టర్ కె. శ్రీనివాస్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, మల్లంపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర భార్గవి, ఎంపీడీఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం త్వరితగతిన తరలించాలి

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా మిల్లులకు త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్, గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు మల్లారెడ్డిపేట, ముస్తాఫానగర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం రవాణాకు లారీల కొరత రాకుండా తగినన్ని వాహనాలను సమకూర్చాలని ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల పర్యటన అనంతరం గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర, లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్, కొత్తపల్లిలోని వాయుపుత్ర రైస్ ఇండస్ట్రీస్‌ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం లారీలను మిల్లుల వద్ద ఎక్కువ సేపు ఉంచకుండా వెంట వెంటనే అన్‌లోడింగ్ చేయించాలని మిల్లర్లను ఆదేశించారు. అవసరమైతే అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ పరిశీలనలో గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి, సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శ



**కోనరావుపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు గురువారం పర్యటించి, పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన మామిడి ప్రభాకర్ రెడ్డి ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా.. చల్మెడ ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గొల్లపల్లి వెంకటేష్ గౌడ్ కుటుంబాన్ని చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచులు నాగరాజు, మల్లేశం, కొలనూర్ సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్ రావు, సీనియర్ నాయకులు చంద్రయ్య గౌడ్, భూమా రెడ్డి, శివతేజ, సుమన్, అన్వేష్, గ్రామ నాయకులు బెదిరి దేవయ్య, కేతిరెడ్డి మోహన్ రెడ్డి, గడ్డం రాజిరెడ్డి, ఎక్కలదేవి దేవేందర్, డాక్టర్ శంకర్, రవీందర్, లింగారెడ్డి, దేవరాజు, చంద్రయ్య, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

# జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసల జల్లు

- 'ఆయన నాకు మంచి స్నేహితుడు'
- ఇరు దేశాల మధ్య శిఖరాగ్ర సదస్సులో ట్రంప్

**బీజింగ్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం గురువారం బీజింగ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రతినిధి బృందాలను ఉద్దేశించి మాట్లాడిన ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌పై ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ తనకు అత్యంత సన్నిహిత మిత్రుడని, ఆయనొక గొప్ప నాయకుడని కొనియాడారు. "జిన్‌పింగ్‌ను కలవడం నాకు దక్కిన గౌరవం. మా మధ్య విభేదాలు వచ్చినప్పుడు కూడా మాట్లాడుకుని త్వరగా పరిష్కరించుకున్నాం. ఆయనను నేను ప్రశంసించడం కొందరికి నచ్చకపోవచ్చు, కానీ నేను ఉన్నది ఉన్నట్లు చెబుతున్నాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలోని అత్యుత్తమ వ్యాపారవేత్తలను వెంటబెట్టుకొని వచ్చానని, చైనా-అమెరికాలు కలిసి ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా అధినేత జిన్‌పింగ్ మాట్లాడుతూ, అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్న తరుణంలో ప్రపంచం దృష్టి తమ రెండు దేశాలపైనే ఉందని అన్నారు. శతాబ్ద కాలంలో చూడని మార్పులు ప్రస్తుతం జరుగుతున్నాయని, చైనా-అమెరికా దౌత్య బంధంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఉందని పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు సాగనున్న ఈ చారిత్రక భేటీలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్, ఎన్‌విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ వంటి దిగ్గజాలు పాల్గొంటున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, టెక్నాలజీ బదిలీ,



తైవాన్ అంశాలపై ఇరు దేశాల నేతలు సుదీర్ఘంగా చర్చించనున్నారు. అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాసింజర్ విమానాల ఎగుమతులను పెంచే దిశగా కీలక ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే ఈ రెండు దేశాల మధ్య కుదిరే ఒప్పందాలపై అంతర్జాతీయ సమాజం ఆసక్తిగా వేచి చూస్తోంది.